క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేసినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు జరిగే శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

దోమలమందు పిచికారీ

నర్సాపూర్(జి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చాక్‌పల్లిలో గురువారం పారిశుధ్య సిబ్బందితో దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం ఆయన వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



తిరుపతిని సన్మానిస్తున్న యువకులు

ఖానాపూర్: తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోట్నాక్ తిరుపతిని మండలంలోని ఆదివాసీ యువకులు ఘనంగా సన్మానించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రంలో జరిగిన కార్యక్రమంలో పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మెస్రం హరి, మోర్తాతి వంశీ, విష్ణు, నవీన్, కార్తీక్, నరేశ్ ఉన్నారు.

మైక్‌సెట్ విరాళం

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని హనుమాన్ ఆలయానికి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన జామ్ ఉన్నత పాఠశాల అటెండర్ తోకల నర్సమ్మ గురువారం మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా నర్సమ్మను గ్రామ వీడీసీ సభ్యులు శాలువాతో సత్కరించారు. వీడీసీ అధ్యక్షుడు రాజేందర్, తుల మహేందర్, భోజన్న, అజీజ్, గంగాధర్, రాజేశ్వర్, శ్రీధర్, సాయన్న, పోశెట్టి, తదితరులు ఉన్నారు.

బాబా ఆలయంలో రద్దీ

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం గోపూజ, బాబాకు మంగళ స్నానం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్న హారతిలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు కురిసి, పంటలు పండాలని కోరుతూ రైతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్నికలపై అవగాహన

తానూరు: మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాలలో గురువారం విద్యార్థులకు నమూనా ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్‌విందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు అవినాశ్ తదితరులు ఉన్నారు.

బ్యాగులు అందజేత

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేసి పదోన్నతిపై కడెం మండలం లింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్లిన ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ పాతఎల్లాపూర్ పాఠశాలలోని 36 మంది విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. సీఆర్పీ వనిత, ఉపాధ్యాయులు నెహ్రూ, మారుతిస్వామి తదితరులు ఉన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి

కడెం: నేతకాని కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని నేతకాని సంఘం నాయకులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. గురువారం ఉట్నూర్ వచ్చిన వచ్చిన వారిని నేతకాని సంఘ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. పోడుభూములకు పట్టాలు, నామినేటెడ్ పదవులతో పాటు హైదరాబాద్‌లో నేతకాని భవన్ నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇందులో నేతకాని సంఘ రాష్ట్ర నాయకులు గంగేశ్, దుర్గె వెంకటేశ్, తదితరులున్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

సోన్: నిజామాబాద్ వైపు నుంచి నిర్మల్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, లారీని మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై గోపి సిబ్బందితో కలిసి అర్ధరాత్రి తనిఖీలు చేపట్టగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సౌకర్యాల్లేని సర్కారుబడి..

- చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్న గదులు
- కానరాని మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- ఏటా తగ్గుతున్న ప్రవేశాలు



అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం



పెచ్చులూడుతూ ప్రమాదకరంగా గది



పాఠశాలలో ఏకైక పురాతన మరుగుదొడ్డి

లక్ష్మణచాంద: ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామంటున్న ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. లక్ష్మణచాందలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గదులు ఉరుస్తున్నాయి. పాఠశాల పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. కిటికీలు లేకపోవడంతో విషపురుగులు, పాములు తరగతి గదుల్లోకి వచ్చే ప్రమాదం ఉంది. విద్యార్థులు, ఉపాధ్యా యులకు కలిపి ఒకే మరుగుదొడ్డి ఉంది. దానికి నీటి సౌకర్యం సరిగా లేదు. దీంతో ఒంటికి రెంటికి వెళ్లేందుకు వారు అవస్థలు పడుతున్నారు.

నాడు కళ కళ..

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గతంలో జిల్లాలోనే అధికమంది విద్యార్థులున్న బడిగా పేరొందింది. ఒకప్పుడు 200మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 106 మంది(56 మంది బాలికలు, 50 మంది బాలురు) విద్యార్థులు చదువుతుండగా ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వసతుల్లేక ఏటా ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఈ పాఠశాలలో రెండు భవనాలుండగా వాటిల్లో ఐదు గదులు ఉన్నాయి. నాలుగు గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుండగా ఒక గదిని స్టోర్‌రూంగా మార్చారు. సౌకర్యాల్లేకనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఏటా ప్రవేశాలు తగ్గుతున్నాయి.

ప్రధాన సమస్యలివే..

- పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో చిరుజల్లులకే తరగతి గదులు ఉరుస్తున్నాయి. పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి.
- విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు.
- కిటికీలకు తలుపులు లేవు.
- పాఠశాల వెనుక ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి.

అసంపూర్తిగా మన ఊరు–మన బడి పనులు

గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాల మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ఎంపికైంది. దీంతో ప్రభుత్వం భవన నిర్మాణం, ఇతర మరమ్మతులకు రూ.19.51లక్షలను కేటాయించింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండు తరగతి గదులు, రెండు మూత్రశాలల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరు కాకపోవడంతో పనులను అసంపూర్తిగా వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట సర్కారు బడుల్లో కనీస సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టింది. కానీ ఈ పాఠశాలకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. అధికారులు స్పందించి ఈ బడిలో సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గది ఉరుస్తుంది



చిన్నపాటి వర్షానికే తరగతి గది ఉరుస్తుంది. దీంతో గదిలో కూర్చోవడం ఇబ్బందిగా ఉంది. మరోవైపు పెచ్చులు కింద పడుతున్నా యి. ఎప్పుడు ఏయే ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం.

– రిషిక, ఐదో తరగతి

ఒంటికి, రెంటికి ఇంటికే..



పాఠశాలలో సరిపడ మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. ఒంటికి, రెంటికి వస్తే ఇంటికే వెళ్లి వస్తున్నాం. అధికారులు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– సాత్విక, ఐదోతరగతి

ఇబ్బందుల మధ్యే బోధన..



ఇటీవల బదిలీపై ఈ ప్రాథమిక పాఠశాలకు వచ్చా. ఇక్కడ విద్యార్థులకు సరి పడా తరగతి గదులు లేవు. ఉన్నవి కూడా శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం ఇబ్బందుల మధ్యే పాఠాలు బోధిస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– సాయన్న, ప్రధానోపాధ్యాయుడు

నిధులు రాకనే పనులు నిలిచిపోయాయి

మన ఊరు– మనబడి కింద లక్ష్మణచాంద ప్రాథమిక పాఠశాల ఎంపికవడంతో గత ప్రభుత్వం రెండు తరగతి గదులు, మూత్రశాలల నిర్మాణానికి నిధులు కేటాయించింది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు మధ్యలో నిలిచిపోయాయి. నిధులు విడుదల చేస్తే పనులు పూర్తవుతాయి.దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం.

– మధుసూదన్, ఎంఈఓ

ఆయకట్టు అభివృద్ధి కమిటీ ఎన్నిక

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ చెరువు ఆయకట్టు అభివృద్ధి కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గురిజాల రాజన్న, ఉపాధ్యక్షుడిగా కొమురయ్య, కోశాధికారిగా లక్ష్మయ్య, సలహాదారుగా దండుగుల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లచ్చాగౌడ్, రాజన్న, అశోక్, భీమేశ్, రాజన్న ఉన్నారు.

మందుల పంపిణీ

ముధోల్: మండల కేంద్రంలో గురువారం బీపీ వ్యాధిగ్రస్తులకు అంబులెన్స్ డ్రైవర్ గడ్డం సుభాశ్ సొంత ఖర్చులతో మందులు పంపిణీ చేశారు. బీపీ మందులు కొనలేని వారి కోసం వంద రోజులకు సరిపడా మాత్రలు అందించినట్లు పేర్కొన్నారు.

జనంలోకి నెమలి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ జర్నలిస్ట్ కాలనీలో గురువారం నెమలి ప్రత్యక్షమైంది. ఓ ఇంటి ముందు తిరుగుతూ సందడి చేసింది. అక్కడున్న వారంతా నెమలిని చూసి ఆశ్చర్యపోయారు. వారు దగ్గరకు వెళ్లేసరికే ఎగిరిపోయింది.

ప్రమాదాన్ని నివారించారు..



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కౌన్సిలర్ అహ్మద్, సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో ఉన్న ఓవైసీనగర్‌లో ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్ సూచన మేరకు తక్కువ ఎత్తులో ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను సరి చేయాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కౌన్సిలర్ అమీర్ అహ్మద్ తెలిపారు. వారు స్పందించి గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేశారు. ఏఈ మోహన్, సిబ్బంది, ఎంఐఎం నాయకులు ఉన్నారు.

విద్యార్థుల వద్దకే ఆర్టీసీ బస్సు

- ఏర్పాటు చేయించిన కలెక్టర్, జడ్జి
- 'డబుల్' ఇళ్ల నుంచి కస్బా ఉన్నత పాఠశాలకు నడువనున్న వాహనం



పాఠశాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు

నిర్మల్‌రూరల్: పాఠశాల దూరం కావడంతో విద్యార్థుల కోసం కలెక్టర్ అభిలాష అభినవ్, జడ్జి విజయ ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయించారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని కస్బా ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థుల కుటుంబాలకు ఇటీవల కలెక్టరేట్ ఎదుట ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించగా వారు నివాసం ఉంటున్నారు. గతేడాది పాఠశాల చుట్టుపక్కల ఉండి చదువుకున్న విద్యార్థులు.. ఇప్పుడు ఇళ్లు మారడంతో పాఠశాల దూరమైంది. దీనికి తోడు ఈసారి బడిబాటలో భాగంగా మరికొందరు కస్బా పాఠశాలలో ప్రవేశం పొందగా విద్యార్థుల సంఖ్య 72కు చేరింది. ఈ 72 మంది విద్యార్థులు డబుల్ బెడ్ రూం ఇళ్ల నుంచి పాఠశాల వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న కలెక్టర్, జడ్జి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయించారు. ఉదయం పాఠశాలకు తీసుకెళ్లి.. సాయంత్రం ఇంటి వద్ద దింపేస్తుంది. గురువారం ఈ బస్సు ప్రారంభమైంది. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, పీఈటీ భూమన్న, ఉపాధ్యాయులు సాయన్న, అతరుద్దీన్, తఫీముద్దీన్, దశరథ్, లక్ష్మీనారాయణ, ఆర్టీసీ అధికారులు వెళ్లి విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చారు. బస్సు కేటాయించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు, జడ్జికి ధన్యవాదాలు తెలిపారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామపంచాయతీలకు ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బైరి సోమేశ్ అన్నారు. గురువారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్మల్‌లోని ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తొడసం శంభు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు నిధులు రాకపోవడంతో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. కనీసం ట్రాక్టర్లకు కిస్తీలు కూడా చెల్లించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మరి సంతోష్, ఉపరి సత్యం, పంద్రం పవన్, విజయ్ ఉన్నారు.

తల్లిదండ్రులతో మొక్కలు నాటించాలి



కల్లూర్ కేజీబీవీలో మొక్క నాటుతున్న డీఆర్డీవో

కుంటాల: విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మొక్కలు నాటించాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కల్లూర్ కేజీబీవీ, అందాకూర్‌లో మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కుటుంబసభ్యుల పేరిట మొక్కలు నాటి సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఎస్‌వో సువర్ణ, పంచాయతీ కార్యదర్శులు రమ్య, భోజన్న, టీఏలు జైసింగ్, కార్తీక్, ఎఫ్‌ఏలు రాందాస్, భోజన్న పాల్గొన్నారు.

పుట్టినరోజున మొక్క నాటాలి

కడెం: విద్యార్థులు పుట్టినరోజున మొక్క నాటి సంరక్షించాలని మండలంలోని లింగాపూర్ పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ పిలుపునిచ్చారు. గురువారం పాఠశాల విద్యార్థిని అక్షయ పుట్టినరోజు సందర్భంగా ఆమెతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమేశ్వర్, లక్ష్మణ్, వాల్గోట్ కిషన్, నర్సయ్య, మహేశ్ తదితరులున్నారు.

'నిధులు దుర్వినియోగం చేశారనడం నిజం కాదు'

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో సీసీ రోడ్ల నిధులు దురినియోగం చేసి సొంతానికి వినియోగించుకున్నారని తనపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని మాజీ సర్పంచ్ ఏనుగు రాంరెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని సీసీ రోడ్ల నిధులు రూ.1,69,785 రాంరెడ్డి వాడుకున్నాడని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ చొక్కాల బాపయ్య ఆరోపిస్తూ ఏప్రిల్ 1న గ్రామ పంచాయతీ ఎదుట నిరసన తెలిపాడు. దీనికి సంబంధించి బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లు, ఆధారాలు పోలీసులు పరిశీలించి నిధులు వాడుకోలేదని తేల్చినట్లు రాంరెడ్డి తెలిపారు. తనపై ఆరోపణలు చేసిన బాపయ్యపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అట్ల చిన్న రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, సురకంటి ప్రసాద్‌రెడ్డి, ఆనంద్ ఉన్నారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త దయాకర్ తల్లి ఇటీవల ప్రమాదంలో గాయపడ్డారు. గురువారం బాధిత కుటుంబాన్ని వారి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. నాయకులు రమేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

ఖానాపూర్: మండలంలోని కొత్తపేట్ ప్రాథమిక పాఠశాల నుంచి పదోన్నతిపై కడెం మండలం లింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్లిన ఉపాధ్యాయురాలు కళావతిని గ్రామస్తులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కొత్తపేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాశవేణి సునీత, ఉపాధ్యాయులు మురళి, బాలాజీ తదితరులు ఉన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఈవో అంబాజీ

సోన్: వానాకాలంలో సాగు చేస్తున్న పంటల వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని సోన్ ఏఈఓ అంబాజీ అన్నారు. గురువారం మండలంలోని న్యూవెల్మల్‌లో చేన్ల వద్దకు వెళ్లి పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. క్లస్టర్‌లోని సోన్, న్యూవెల్మల్, బొప్పారం, కూచన్‌పెల్లి గ్రామాల్లో వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రైతులు మల్లయ్య, భోజన్న, భూమయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడి పాఠాలు

- ఎమ్మెల్యే చొరవతో నియామకం

సారంగపూర్: మండలంలోని మహావీర్‌తండా పంచాయతీ పరిధిలోని దుర్గానగర్ తండాకు గురువారం డిప్యుటేషన్‌పై ప్రభుత్వ ఉపాధ్యాయుడిని నియమించారు. వివరాల్లోకి వెళితే.. దుర్గానగర్ తండాలో పాఠశాల లేదు. అక్కడ 18 మంది బడీడు పిల్లలు ఉండగా నిత్యం అవస్థలు పడుతూ సమీపంలోని హనుమాన్‌తండాకు, లేదా జామ్ గ్రామానికి కాలినడకన వెళ్లి వస్తున్నారు. చిన్నారుల ఇబ్బందులను గ్రామస్తులు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకుని హనుమాన్ తండా పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై దుర్గానగర్‌లో నియమించారు. దుర్గానగర్‌లో పాఠశాల లేకపోవడంతో ప్రస్తుతం తండావాసులు నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌లో పాఠాలు బోధిస్తున్నారు. సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సదరు ఉపాధ్యాయుడిని బీజేపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో రామ్‌శంకర్‌రెడ్డి, సాహెబ్‌రావు, మంతెన గంగారెడ్డి, రాజేశ్వర్, తిరుమల చారి, శివరాం, రూప్‌సింగ్, గోకుల్, సంతోష్, అంబాజీ, రామ్‌రావు, బాబులాల్ ఉన్నారు.



గుల్లపేటలో గుంపుగా కూర్చున్న కోతులు

భయపెడుతున్న వానరాలు

జిల్లా కేంద్రంలో రోజురోజుకు వానరాల సంఖ్య పెరుగుతోంది. కాలనీల్లో గుంపులుగుంపులుగా చేరి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. సారంగపూర్ మండలం చించోలిలో కోతుల పునరావాస కేంద్రం ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుంది. ఇటీవల పలువురిపై దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. కోతులను పట్టి పునరావాస కేంద్రానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఇంద్రానగర్‌లోని ఓ ఇంటి గోడపై..

వడ్యాల్‌లో కూలిన వంతెన



కూలిన వంతెన

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ వద్ద సరస్వతి కాలువపై ఉన్న పురాతన వంతెన గురువారం కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మామడ మండలం పరిమండల్ వద్ద మాటు కాలువ ద్వారా లక్ష్మణచాంద మండలంలోని పలు చెరువుల్లోకి నీళ్లు వస్తాయి. వడ్యాల్ గ్రామంలో బొడకుంట చెరువు నుంచి పెద్ద చెరువులోకి నీళ్లు సరస్వతి కాల్వ ద్వారానే వస్తాయి. వంతెన కూలడంతో పెద్ద చెరువులోకి నీళ్లు వచ్చే అవకాశం లేదని వడ్యాల్ రైతులు వాపోతున్నారు.

యాపలగూడలో అకాడి సంబురాలు



పూజలు చేస్తున్న ఆదివాసీలు

పెంబి: ఆషాఢమాసంలో ఆదివాసీలకు ప్రారంభమయ్యే తొలి పండుగ అయిన అకాడి సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం మండలంలోని యాపలగూడ అటవీ ప్రాంతంలో చెట్ల కింద ఉన్న దేవతల ప్రతిమలను శుద్ధి చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు. వంటా వార్పు అనంతరం సహపంక్తి భోజనాలు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో యాపలగూడ ఆదివాసీలు రఘునాథ్, అర్కదేవ్, మహజన్, అర్క మారుతి, నైతం కృష్ణ తదితరులు ఉన్నారు.